క్లుప్తంగా

23, 24న గంగజాతర

బంగారుపాళెం: బంగారుపాళెంలో ఈ నెల 23, 24న గంగజాతర నిర్వహించనున్నట్లు జాతర కమిటీ సభ్యులు, నిర్వాహకులు తెలిపారు. జాతరలో భాగంగా మంగవారం ఉదయం అమ్మవారి అంబలి, సాయంత్రం పొంగళ్లను సమర్పించనున్నట్లు తెలిపారు. రాత్రి అమ్మవారిని ఊరేగిస్తామని, బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం రాత్రి జలప్రవేశం చేయనున్నట్లు తెలిపారు.

క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసుల

చిత్తూరు కార్పొరేషన్: గోవాలో జరిగిన ఆల్ ఇండియా రోలర్ రిలే చాంపియన్‌షిప్‌లో చిత్తూరుకు చెందిన పిల్లలు ప్రతిభ చాటారు. నగరానికి చెందిన బువిక్, కోషల కృష్ణా, హాసిని, కుషాల్‌వర్ధన్, అభిరాంప్రసాద్, ఆదిత్య, మన్యు, దేవ్‌వితున్ 6 స్వర్ణ, 7 వెండి, 6 కాంస్య పతకాలు సాధించారని కోచ్ కార్తీక్ తెలిపారు. వీరిని చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు తన నివాసంలో సన్మానించారు.

విజయపురం ఇన్‌చార్జి ఎంపీడీఓగా ప్రసాద్

చిత్తూరు కార్పొరేషన్: విజయపురం ఇన్‌చార్జి ఎంపీడీఓగా జెడ్పీ కార్యాలయ పర్యవేక్షకులు ప్రసాద్‌ను నియమిస్తూ జెడ్పీ సీఈఓ ప్రభాకర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఉన్న సతీష్ అనారోగ్యం కారణంగా సెలవుపై వెళ్లారు. ఈ నేపథ్యంలో ఆ స్థానాన్ని భర్తీ చేయాలనిమంత్రి రోజా జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులను కోరారు. దీంతో ఆ స్థానాన్ని భర్తీ చేశారు.

21న టీడీపీ జిల్లా మహానాడు

చిత్తూరు అర్బన్: నగరంలో ఈ నెల 21న తెలుగుదేశం పార్టీ మహానాడును నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పులివర్తి నాని ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ఆదివారం ఉదయం 10 గంటలకు చిత్తూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో జరిగే మహానాడుకు పార్టీ నేతలు, కార్యకర్తలు అందరూ హాజరుకావాలని కోరారు.

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టండి

పూతలపట్టు: ప్రజా సమస్యలపై రెవెన్యూ ఉద్యోగులు దృష్టి పెట్టాలని తహసీల్దార్ విజయభాస్కర్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో వీఆర్‌ఓ, సర్వేయర్లతో ఆయన సమీక్షించారు. ప్రజలు అర్జీలతో కార్యాలయానికి వచ్చినప్పుడు వారి సమస్యలను పరిష్కరించాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. శ్మశానం లేని గ్రామాలకు ప్రభుత్వ భూములను సర్వే చేసి వారికి శ్మశాన స్థలం కల్పించాలన్నారు.. మండలంలో 18 ఏళ్లు నిండిన యువకులకు ఫారం-6బి ద్వారా వారికి ఓటు హక్కును కల్పించాలనిబీఎల్‌ఓలకు ఆదేశించారు.

ధ్యానమే దైవ మార్గం



పిరమిడ్ ప్రతిమలను పంపిణీ

బంగారుపాళెం: మానవులు ధ్యాన సాధనతో దైవ మార్గాన్ని అనుసరించాలని సీనియర్ పిరమిడ్ మాస్టర్ బాలాజి అన్నారు. మండలంలోని కుప్పాళ్లపల్లెలోని పిరమిడ్ ధ్యాన ఆశ్రమంలో వారం రోజులుగా 75వ శ్రీమద్భగవద్గీత ధ్యాన జ్ఞాన సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. చివరి రోజు మంగళవారం రాత్రి ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రజలు నిద్రలేచింది మొదలు రాత్రి పడుకునే వరకు పలు సమస్యలతో మానసిక ప్రశాంతతను కోల్పోతున్నారని, రోజూ కొంత సేపు ధ్యానం చేస్తే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. సన్మార్గంలో పయనించేందుకు భగవద్గీత పారాయణం చేయాలన్నారు. ధ్యానం ఎలా చేయాలో వివరించారు. అనంతరం ధ్యానులకు పిరమిడ్ ప్రతిమలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పిరమిడ్ మాస్టర్ రేవతి, ఆశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు.

గాయపడిన సర్పంచ్ మృతి



బాలాజి (ఫైల్)

బంగారుపాళెం: రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న కాటప్పగారిపల్లె సర్పంచ్ బాలాజీ బుధవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఎద్దులవారిపల్లెకు చెందిన బాలాజి(40) వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌గా ఉన్నారు. వారం క్రితం ద్విచక్రవాహనంపై బంగారుపాళెం నుంచి స్వగ్రామానికి వెళ్తూ జాతీయ రహదారిపై అదుపు తప్పి, డివైడర్‌ను ఢీకొని కింద పడడంతో తీవ్రంగా గాయపడ్డారు. పరిస్థితి విషమంగా ఉండడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి స్విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. బాలాజీ మృతికి మండలంలోని పలువురు సర్పంచులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. కాటప్పగారిపల్లె పంచాయతీని అభివృద్ధి పథంలో తీసుకెళ్లేందుకు ఎంతగానో కృషి చేశారని సేవలను గుర్తు చేసుకున్నారు.

వెళ్లి రావమ్మా..గంగమ్మా!



కొక్కీలకు వేలాడుతూ మొక్కులు చెల్లిస్తున్న భక్తులు



నోటికిశూలం గుచ్చుకుని వస్తున్న భక్తురాలు

చిత్తూరు రూరల్: కంటికి రెప్పలా కాపాడే తల్లీ.. అంటువ్యాధుల నుంచి రక్షించే జగన్మోహిని..గంగాజలం కురింపించే గంగాభవానీ.. వెళ్లి రావమ్మా- అంటూ చిత్తూరు వాసులు గంగమ్మ నిమజ్జన కార్యక్రమాన్ని కోలాహలంగా నిర్వహించారు. చిత్తూరులో బుధవారం గంగజాతర ముగిసింది. గంగమ్మను భక్తిశ్రద్ధలతో జలాధి చేశారు. జాతర సంబరాల్లో యువకులు ఉర్రూతలూగారు. డప్పు మేళాల హోరు నడుమ చిందులేశారు. జన సందడి మధ్య అమ్మవారిని నిమజ్జనానికి తరలించారు. ఓం శక్తి భక్తుల విన్యాసాలు గగుర్పొడిచాయి. నడివీధితో పాటు కొంగారెడ్డిపల్లె, మురకంబట్టు, సంతపేట, గిరింపేట, ఓబనపల్లె తదితర ప్రాంతాల్లో నిమజ్జనం ఘనంగా నిర్వహించారు.

గంగమ్మ దీవెనతోనే ఓంశక్తి మొక్కులు

గంగమ్మ దీవెనతోనే కోరిన కోర్కెలు నెరవుతున్నాయని, అందుకే ఏటా గంగజాతరలో మొక్కులు చెల్లించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోందని ఓం శక్తి భక్తుల జిల్లా అధ్యక్షురాలు సరిత పేర్కొన్నారు. ఓంశక్తి విన్యాసాలను ఉద్దేశించి ఆమె మీడియాతో మాట్లాడారు. అమ్మవారిపై ఉన్న భక్తితో చాలా మంది వినూత్న రీతిలో మొక్కులు చెల్లించారని చెప్పారు. ఈసారి 600 మందిపైగా ఈ విన్యాసాల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్ముగం రెడ్డి, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మ సేవలో డిప్యూటీ సీఎం

కొంగారెడ్డిపల్లెలో కొలువుదీరిన గంగమ్మకు డిప్యూటీ సీఎం నారాయణస్వామి గజమాల సమర్పించి దర్శించుకున్నారు. ఆయనను జాతర పెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

• ఆశీస్సులు



స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆశీస్సులు పొందుతున్న ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి

కాణిపాకం(యాదమరి): విజయవాడలో విశాఖ శారద పీఠాధిపతి నుంచి కాణిపాక ఆలయ చైర్మన్ మోహన్ రెడ్డి, ,ఈఓ వెంకటేశులు ఆశీస్సులు పొందారు. వారం రోజులుగా రాష్ట్ర దేవదాయ శాఖ విజయవాడ ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో నిర్వహిస్తున్న అష్టోత్తర శతకుండాత్మక చండీ, రుద్ర రాజశ్యామల, సుదర్శన సహిత శ్రీ లక్ష్మీగణపతి మహా యజ్ఞం చివరి రోజున నిర్వహించిన మహా పూర్ణాహుతి కార్యక్రమానికి కాణిపాకం నుంచి ఆలయ చైర్మన్, ఈఓ, ఆలయ అర్చకులు హాజరయ్యారు. అక్కడ విశాఖ శారదా పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి స్వాములను మర్యాదపూర్వకంగా కలిశారు. స్వామివారి తీర్థ ప్రసాదాలు, అందజేసి వారి ఆశీస్సులను అందుకున్నారు.

శాస్త్రోక్తంగా తిరుమంజనం



తిరుమంజనం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ శ్రీ మణికంఠేశ్వరస్వామి ఆలయంలో బుధవారం ఆలయ అధికారులు, అర్చకులు శాస్త్రోక్తంగా తిరుమంజనం నిర్వహించారు. ప్రతి బుధవారం సాయంత్రం 4 గంటలకు తిరుమంజనం నిర్వహించడం పరిపాటి. స్వామివారి ఆలయం చుట్టు పరివార దేవతలు, ధ్వజస్తంభం, రాహుకేతు మండపాలను శుద్ధి చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ శ్రీధర్‌బాబు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ బాబు, శానిటేషన్ అధికారులు పాల్గొన్నారు.

ఇళ్ల ముంగిటకే వైద్యం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్

ఐరాల: ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంతో గ్రామీణ ప్రజలకు ఇళ్ల ముంగిటే వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని చుక్కావారిపల్లెలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో వైద్యాధికారి 80 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం దీర్ఘకాలిక రోగుల ఇళ్లకు వెళ్లారు. వారి ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సూచనలు-సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ జీవకళ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



గుడిపాల: చిత్తపారలో..

చిత్తపారలో..

గుడిపాల: మండలంలోని చిత్తపారలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ 62 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. అలాగే గర్భవతులు, బీపీ, మధుమేహ వ్యాధిగ్రస్తులను పరీక్షించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది హేమలత, సంధ్య పాల్గొన్నారు.

సమన్వయంతోనే అభివృద్ధి



మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: అధికారులు సమన్వయంతో పని చేస్తేనే మండల అభివృద్ధి సాధ్యమని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో పలు శాఖాధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలులో నిర్లక్ష్యం ఉండ కూడదన్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి సచివాలయ సిబ్బంది పారదర్శకంగా పని చేయాలని తెలిపారు. గృహ నిర్మాణ లబ్ధిదారులు త్వరిగతిన నిర్మాణ పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బిల్లులను సత్వరం చెల్లించాలని, అవసరమైన వారికి గృహ నిర్మాణాల కోసం రుణాల మంజూరుకు చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పనిచేసి మండలాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎంపీడీఓ మహేష్, హౌసింగ్ ఈఈ, ఏపీఎం పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



సామాజిక తనిఖీపై మాట్లాడుతున్న పీడీ గంగాభవాని

యాదమరి: ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని ఆ పథక పీడీ గంగా భవాని ఆదేశించారు. యాదమరి మండలంలో ఏప్రిల్ 2022 నుంచి ఈ నెల 5వ తేదీ వరకు చేసిన ఉపాధి హామీ పనులకు సంబంధించి బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ప్రజావేదిక నిర్వహించారు. ఆడిట్ రిపోర్టును పీడీ పరిశీలించి 1342 పనులకుగాను రూ.43 వేల రికవరీకి ఆదేశించారు. మండలంలో ఉపాధి కూలీల సంఖ్య చాల తక్కువగా ఉందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శివరాజ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మా సమస్యలు పరిష్కరించరూ!

కలెక్టర్‌కు సచివాలయ ఉద్యోగుల వినతి



కలెక్టర్‌కు డైరీ ఇస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లాలోని సచివాలయ ఉద్యోగుల క్షేత్రస్థాయిలో తమ సమస్యలపై కలెక్టర్ షణ్మోహన్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఎన్జీఓ సంఘం జిల్లా అధ్యక్షులు రాఘవులు, గ్రామ, వార్డు సచివాలయం ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు సయ్యద్ బాషా మాట్లాడారు. సచివాలయ ఉద్యోగులకు సంపాదిత సెలవులు, హాఫ్ పే సెలవులు, సర్వీస్ పుస్తకంలో నమోదు సమస్య, హెల్త్‌కార్డుల ఆమోదం సమస్యలు పరిశీలించి పరిష్కరించాలని కోరారు. ఏపీజీఎల్ఐ బాండ్స్ జారీలో సమస్యలున్నట్లు తెలిపారు. అనంతరం ఆ సంఘ నాయకులు కలెక్టర్‌కు సచివాలయ ఉద్యోగుల డైరీని అందజేశారు. కార్యక్రమంలో నాయకులు మహేష్, రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలోనే మైనారిటీలకు గుర్తింపు

పులిచెర్ల(కల్లూరు): వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలోనే ముస్లి మైనారిటీలకు తగిన గుర్తింపు వచ్చిందని మండల సచివాలయ కన్వీనర్ ముర్వత్‌బాషా తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ హజ్ యాత్రికులకు పడే అదనపు భారాన్ని ప్రభుత్వమే భరించి ఆదుకోవడం ముస్లింలపై సీఎం జగన్ మోహన్‌రెడ్డికి ఉన్న అభిమానాన్ని తెలియజేస్తోందన్నారు. ఈ అభిమానానికి ముస్లింలందరూ ఆయనకు రుణ పడి ఉందామన్నారు. ముస్లింల సంక్షేమానికి ఎన్నో పథకాలను అమలు చేస్తున్నారని తెలిపారు.

జాతర ఆదాయం రూ.8.06 లక్షలు



కానుకలను లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

పలమనేరు: పట్టణంలో శ్రీతిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఆలయానికి రూ.8.06 లక్షలు ఆదాయం వచ్చినట్లు దేవస్థానం చైర్మన్ నరేష్ తెలిపారు. బుధవారం అధికారులు, కమిటీ సభ్యులు, పట్టణపెద్దల సమక్షంలో గంగమ్మ ఆలయంలో హుండీ కానులను లెక్కించారు. సారెలు, సేవా టిక్కెట్లు, హుండీ ద్వారా వచ్చిన నగదు, బంగారం, వెండి, విదేశీ డాలర్ల ద్వారా రూ.8.06 లక్షలు లభించినట్లు చైర్మన్ పేర్కొన్నారు. గత ఏడాది కంటే ఈ దఫా ఎక్కువగానే ఆదాయం వచ్చినట్లు తెలిపారు కమిటీ సభ్యులతో కలసి ఆలయ చైర్మెన్ నరేష్ విలేకరులతో మాట్లాడుతూ ఎన్నడూ లేనంతగా లక్షలాదిమంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని తెలిపారు. ఆలయంలో ప్రతి భక్తుడు అమ్మవారిని బాగా దర్శించుకోవాలనే లక్ష్యంతో ఆపకుండా వదలడంతో కొందరు హుండీ వద్దకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. జాతర ప్రశాంతంగా నిర్వహించడంలో పట్టణ సీఐ చంద్రశేఖర్, సిబ్బంది, ప్రజలకు, మీడియాకు కృతజ్ఞతలను తెలిపారు. కానుకల లెక్కింపు కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రెడ్డెప్ప రెడ్డి, మంజుల సుబ్రమణ్యం, కృష్ణవేణి గోవిందప్ప, ప్రసాద్ రెడ్డి, వేణు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్యాయత్నం

చౌడేపల్లి: మండలంలోని 29 ఏ చింతమాకులపల్లెలో బుధవారం అత్తతో గొడవ పడి కోడలు విషం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికుల కథనం మేరకు గ్రామానికి చెందిన భాస్కర్ భార్య రవళి(23) అత్త పద్మావతితో ఇంటి వద్ద గొడవ పడింది. మనస్తాపం చెంది ఇంటిలో ఉన్న పురుగు మందును తాగింది. అపస్మారస్థితిలో పడి ఉన్న ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు 108 వాహనంలో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికు తరలించారు. కాగా ఆమె పరిస్థితి విషమంగా ఉంది. ఈమేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పుట్టింటి కంటే పథకాలతో ఎక్కువ లబ్ధి



లబ్ధిదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

- జగనన్నను మరోసారి సీఎం చేస్తాం
- గడప గడపకు మన ప్రభుత్వంలో స్పష్టం చేసిన మహిళలు

పూతలపట్టు: 'వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయినాకే మాకు చాలా మేలు చేసినారు.. మా పుట్టింటి నుంచి ఎంతో కొంత మాకు ఇస్తారు..కానీ జగనన్న సంక్షేమ పథకాలతో మాకెంతో చేసినారు.. అందుకే మా కుటుంబాలు సంతోషంగా ఉండాయి.. ఇప్పటివరకూ ఏ ప్రభుత్వం ఇంతగా మాకు చేసింది లేదు..అందుకే వచ్చేసారి ఎలచ్చన్లలో మళ్లీ జగనన్న ఫ్యాను గుర్తుకే ఓట్లేస్తాం సారు' అని పలువురు మహిళలు ఎమ్మెల్యేకు చెప్పారు. బుధవారం మండలంలోని కోట్లపల్లె, పేటమిట్ట, తలుపులేనివారిపల్లె, శేషాద్రి నగర్ గ్రామాలలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పలకరించారు. ఆయా కుటుంబాల వ్యక్తులు సంక్షేమ పథకాలతో పొందిన లబ్ధిని వివరిస్తూ బుక్‌లెట్‌లను అందజేశారు. పథకాలు అందరికీ అందుతున్నాయా? అని ఎమ్మెల్యే ప్రశ్నకు..మహిళలు పైవిధంగా స్పందించారు. దీనిపై ఎమ్మెల్యే ప్రతిస్పందిస్తూ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉంటేనే సంక్షేమ పథకాలు అందుతాయని, తెలుగుదేశం పార్టీ కల్లబొల్లి మాయమాటలను నమ్మి మోసపోరాదన్నారు. సంక్షేమ ఫలాలను సద్వినియోగం చేసుకుంటూ మహిళలు మరింత ఆర్థికంగా ఎదగాలని ఆకాంక్షించారు. గ్రామస్తులు తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారులు పరిష్కరించాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కార్యక్రమంలో సీనియర్ నాయకుల తలపులపల్లి బాబురెడ్డి, రాజారత్నం రెడ్డి, పార్టీ మండల కన్వీనర్ శ్రీకాంత్ రెడ్డి, జెడ్పీటీసీ దేవిక, ఎంపీపీ కుమారి, వైస్ ఎంపీపీ ద్వారకనాథరెడ్డి, దొరస్వామిరెడ్డి, సర్పంచ్ బాబునాయుడు, ఎంపీడీఓ గౌరి, తహసీల్దార్ విజయభాస్కర్, ఎస్ఐ హరిప్రసాద్, సర్పంచులు, ఎంపీటీసీలు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు పాలకూరు పంచాయతీలో..

పాలకూరు పంచాయతీలో గురువారం ఉదయం 7 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహిస్తారని ఎంపీడీఓ తెలిపారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర్లు



సత్యవేడు: స్థానిక జూనియర్ సివిల్‌జడ్జి కోర్టు లాయర్ల బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా డి.వెంకటేశ్వర్లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం సాయంత్రం బార్ అసోసియేషన్ కార్యాలయంలో న్యాయవాదుల సంఘం నూతన కార్యవర్గాన్ని ఎన్నికల అధికారి వేలు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. సెక్రటరీగా జక్కుల రమేష్, ట్రెజరర్‌గా జానయ్య ఎన్నికయ్యారు. నూతన అధ్యక్షుడు మాట్లాడుతూ, న్యాయవాదుల సంక్షేమానికి తన వంతు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో లాయర్లు పిడి.వెంకటేశ్వర్లు, సీనియర్ లాయర్ వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, శ్రీరామమూర్తి, లోకేష్ పాల్గొన్నారు.

కోలాహలంగా నిమజ్జనం



గంగమ్మకు పూజలు చేస్తున్న భక్తులు

తవణంపల్లె: మండలంలోని పలు గ్రామాల్లో గంగ జాతర ఉత్సవాలను రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహించారు. తవణంపల్లెలో నడివీధి గంగమ్మకు భక్తులు పూజలు చేసి మొక్కులు చెల్లించారు. టి.పుత్తూరు, దిగువతడకర గ్రామాల్లోనూ అమ్మవారికి కొబ్బరికాయలు కొట్టి, కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆ తర్వాత గంగమ్మను ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

వసతులు కల్పించాలి

చిత్తూరు కార్పొరేషన్: జిల్లాలో ఎండ త్రీవత ఎక్కువగా ఉన్న నేపథ్యంలో కార్మికులకు యజమానులు, నిర్వాహకులు వసతులు కల్పించాలని జిల్లా సహాయ కార్మిక కమిషనర్ ఓంకార్‌రావు కోరారు. ఇటుకబట్టీలు, భవన నిర్మాణ, దుకాణలు, వివిధ సంస్థల్లో పనిచేస్తున్న కార్మికులకు నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్, జంబో గొడుగులు అందుబాటులో ఉంచాలన్నారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నగరంలో ఏఎల్‌ఓ జగదీష్‌బాబుతో కలిసి పలు దుకాణ యజమానులతో వసతుల కల్పనపై మాట్లాడామన్నారు. మధ్యాహ్నం 12 గంటల నుంచి 3 గంటల వరకు కార్మికులను ఎండ ప్రాంతంలో పనులకు పంపరాదన్నారు. కార్మికులు నల్లని దుస్తులు వేసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.